## క్లుప్తంగా

### ఎమ్మెల్యేకు సన్మానం



సన్మానిస్తున్న జేకే శేఖర్‌యాదవ్

ఎలిగేడు: మండలంలోని శివపల్లిలో ఎమ్మెల్యే చింతకుట విజయరమణారావు నివాసంలో శుక్రవారం రాష్ట్ర యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి జేకే శేఖర్‌యాదవ్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, రాజేందర్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఐలయ్యయాదవ్, గొర్ల కాపరులు జిల్లా అధ్యక్షుడు ఓదెలుయాదవ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కంకణాల జ్యోతిబసు, జాతీయయువజన అవార్డు గ్రహీత కొండ రవియాదవ్, బొజ్జ శ్రీనివాస్, యాదవసంఘం నాయకులు పాల్గొన్నారు.

### కష్టపడితేనే ఉజ్వల భవిష్యత్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్: కష్టపడితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో కార్డియాల్ పేరిట టెన్త్ విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

### విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ శంకర్

మంథని: విద్యార్థులు, యువకులు క్రీడల్లో నైపుణ్యం సాధిస్తే వారి భవిష్యత్ బాగుంటుందని మంథని ఎంపీపీ కొండ శంకర్ అన్నారు. మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలపై దృష్టిసారించాలన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేలా పదేళ్లుగా క్రీడలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. వైస్ ఎంపీపీ స్వరూప్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఐలి ప్రసాద్, ఎంపీటీసీ చైతన్య ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పేరవేన రాజేశ్ ఉన్నారు.

### శ్రీపాదరావు జయంతి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీపీవో ఆశలత

ముత్తారం: మండలంలోని కేశనపల్లిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు విగ్రహం వద్ద శనివారం జరగనున్న ఆయన జయంతి వేడుకల ఏర్పాట్లను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి ఆశలత పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం శ్రీపాదరావు జయంతిని అధికారికంగా నిర్వహించాలని జారీ చేసిన ఉత్తర్వుల మేరకు డీపీవో ఏర్పాట్ల పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, ఎంపీడీవో లలిత, ఎంపీవో వేణుమాధవ్, కార్యదర్శి ప్రేమలత ఉన్నారు.

### పాఠశాలలో హోమియో వైద్యశిబిరం



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

మంథని: మంథనిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరం విజయవంతమైంది. ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ డాక్టర్ శ్రీవాణి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో స్కిన్ ఎలర్జీస్, ఆర్థరైటిస్, ఆస్తమాకు సంబంధించిన సమస్యలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విద్యార్థులతో పాటు సమీపవాసులు పాల్గొన్నారు. వైద్యులు కేశవరెడ్డి, ఫార్మసిస్టు సుధాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు దొమ్మటి రవి, రాజిరెడ్డి, రవి, మహేందర్ ఉన్నారు.

# తాగునీటి సమస్య లేకుండా చూడండి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్





మిషన్ భగీరథ ఏఈని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

రామగుండం: వేసవి కాలంలో మండల ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అధికారులకు సూచించారు. శుక్రవారం అంతర్గాం మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాల అభివృద్ధికి రూ.రెండు కోట్లు, రామగుండం హైస్కూల్‌కు రూ.40లక్షలు కేటాయించానని తెలిపారు. వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు మండల కేంద్రంలోనే నివాసముంటూ మండల అభివృద్ధికి సహకరించాలన్నారు. మిషన్ భగీరథ తాగునీటిపై ప్రతీ గ్రామంలో ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతూ ప్రజల నుంచి ఫిర్యాదు రాకుండా చూడాల్సిన బాధ్యత భగీరథ అధికారులదేనన్నారు. ఎస్సారెస్పీ కాలువలను ఎప్పటికప్పుడు పునరుద్ధరిస్తూ, పూడికతీత పనులు చేపట్టి ప్రస్తుత సీజన్‌లో చివరి ఆయకట్టుకు సాగునీరందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎంపీపీ దుర్గం విజయ అధ్యక్షతన జరిగిన సమావేశానికి వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, ఎంపీడీవో ఎం.ఎ.అలీం, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, దివాకర్‌రావు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు దాహార్తి సమస్యలు రాకుండా చర్యలు



బావిని పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలో తాగునీటి సమస్య ఏర్పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ అన్నారు. పెద్దపల్లి ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే బావులను శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడంలో సమస్యలు రాకుండా చూడాలని ఎమ్మెల్యే విజయరమణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి సూచించారని ఆయన పేర్కొన్నారు. పట్టణంలోని రంగంపల్లి, తాళ్లకుంట, శాంతినగర్, పెద్దమ్మనగర్ తదితర ప్రాంతాల్లోని బావులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. బావులను శుభ్రం చేయడంతో పాటు తాగునీరు సరఫరా చేసేటప్పుడు క్లోరినేషన్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏఈ సతీశ్, ఫిట్టర్, షఫీ, సిబ్బంది మధు, సదానందం, లక్ష్మణ్ ఉన్నారు.

**వడ్డీ రాయితీని వినియోగించుకోండి..**

పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలో గల ఆస్తులకు సంబంధించి బకాయిపడ్డ ఆస్తి పన్నును వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా ఏకకాలంలో చెల్లించి వడ్డీరాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న ఆస్తి పన్నుపై 90శాతం వడ్డీ మాఫీతో 2023–24 గల బకాయిపై కేవలం 10శాతంతో ఈ నెలాఖరులోగా చెల్లించాలని సూచించారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు

కోల్‌సిటీ: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. సాధారణ పౌరులు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్లలో ఈ నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నామని శుక్రవారం ప్రకటించారు. వీధులు, రోడ్లపై అసభ్య పదజాలంతో మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న మద్యం ప్రియులు ఆగడాలకు కళ్లెం వేయడంలోపాటు ప్రజల భద్రత రక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈనెల 1 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఆంక్షలు కొనసాగుతాయని తెలిపారు.

**డీజే, డ్రోన్‌లపై నిషేధం పొడిగింపు..**

కమిషనరేట్ పరిధిలో డీజే సౌండ్స్ వినియోగంపై నిషేధాజ్ఞలు పొడిగించినట్లు సీపీ తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, పేషెంట్ల ఆరోగ్యంతోపాటు విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలుగకుండా, శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు డీజే సౌండ్స్ వినియోగంపై నిషేధాజ్ఞలు విధించినట్లు పేర్కొన్నారు. ఇవి ఈనెల 1 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు కొనసాగుతాయని సీపీ వెల్లడించారు.

## పొట్యాల హైస్కూల్‌లో మాక్ పోలింగ్



ఓటు వేస్తున్న విద్యార్థులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పొట్యాల హైస్కూల్‌లో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని కలెక్టర్ ఆదేశాల మేరకు మాక్ పోలింగ్ ఏర్పాటు చేసి విద్యార్థులకు ఓటుహక్కు ప్రాధాన్యం గురించి మాక్ పోలింగ్ ద్వారా అవగాహన కల్పించారు. హైస్కూల్ హెచ్‌ఎం.ఎం.సంగీత, ఉపాధ్యాయులు వెంకటరమణ, జొన్న రవీందర్, గద్దె శ్రీనివాస్, రామస్వామి, శ్రీధర్, తిరుపతి, పోచయ్య, లక్ష్మణ్, శేఖర్ ఉన్నారు.

## క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు శుక్రవారం సెంటినరీకాలనీ సెక్యూరిటీ కార్యాలయంలో క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 207 ఖాళీ క్వార్టర్లు ఉండగా ఫ్రెష్ అలాట్‌మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కోసం 127మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. 37 మంది ఉద్యోగులు హాజరు కాగా 33 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. ఎంపిక చేసుకున్న వారికి త్వరలోనే క్వార్టర్ అలాట్‌మెంట్ లెటర్స్ అందజేస్తామని ఎస్‌వోటూ జీఎం సీ.హెచ్.వెంకటరమణ తెలిపారు. డీవైపీఎంలు గుర్రం శ్రీహరి, వి.సునీల్‌ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, క్వార్టర్ల విభాగం సిబ్బంది మహేందర్, సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రతీ పశువుకు గాలికుంటువ్యాధి నివారణ టీకా



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రవీందర్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: పాల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించి పాడి రైతులకు ఆర్థిక నష్టం కలిగించే గాలికుంటు వ్యాధి నివారణ కోసం ప్రతీ పశువుకు ఉచితంగా టీకాలు అందిస్తామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కాట్నపల్లిలో శుక్రవారం గాలి కుంటువ్యాధి నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 52వేల గోజాతి, 93వేల గేదె జాతి పశువులు ఉన్నట్లు వెల్లడించారు. నాయకులు ప్రకాశ్‌రావు, దమోదర్, ఆనందరావు ఉన్నారు.

రామగుండం: ఈనెల 20వ తేదీలోగా అంతర్గాం మండల పరిధిలోని పశువులన్నింటికీ గాలికుంటు నివారణ టీకా వేస్తామని మండల వెటర్నరీ డాక్టర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగానే శుక్రవారం మద్దిర్యాల గ్రామంలో 280 పశువులకు టీకాలు వేశారు. ఎంపీపీ దుర్గం విజయ, గోదావరిఖని ఏడీ డాక్టర్ రామస్వామి ఉన్నారు.

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటలో శుక్రవారం పశువులకు గాలికుంటు నివారణ టీకా వేశారు. మండల పశువైద్యాధికారి ఝాన్సీ, గోపాలమిత్ర పెద్ది సమ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను మండల పశు వైద్యాధికారి అజారుద్దీన్ శుక్రవారం వేశారు. ఎంపీటీసీ దండె వెంకటేశం, గోపాలమిత్ర మోహన్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

## సంక్షిప్త వార్తలు

**ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు**

కోల్‌సిటీ: గోదావరిఖనిలో శుక్రవారం ఆటో బోల్తా పడడంతో కుమార్, రాజేశ్ అనే ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానిక ఫోర్‌ఇంక్లయిన్ రోడ్డులో ప్రయాణిస్తున్న ఆటో అకస్మాత్తుగా రోడ్డుపై బోల్తా పడింది. ఆటోలో ఉన్న ఇనుప స్క్రాప్ ఆటోలో కూర్చున్న యువకుడితోపాటు నడిపిన యువకుడిపై పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి 108లో చికిత్స కోసం జీజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. కాగా కుమార్‌ను మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. ఆటో బోల్తాపడిన ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

**సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం**

కాల్వశ్రీరాంపూర్: కాంగ్రెస్ పాలనతో ప్రజలకు మంచిరోజులు వచ్చాయని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి ఇంద్రకరణ్‌రెడ్డి, యువత మండల అధ్యక్షుడు శివరామకృష్ణ అన్నారు. ఆరుగ్యారంటీ పథకాల అమలు, డీఎస్సీ నోటికేషన్ ప్రభుత్వ ప్రకటనతో హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ నాయకులు ఆషాడపు సురేశ్, ఐలయ్య, వెంకటేశ్, శ్రీనివాస్, రాజేశ్, పవన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం**

కోల్‌సిటీ: గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌కు చెందిన చెన్నూరి రాయమల్లు అనే ప్రముఖ గడియారం వ్యాపారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా మరో ఇద్దరికి చూపును ప్రసాదించడానికి ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు ఐ బ్యాంక్‌కు దానం చేశారు. నేత్రదాత సంస్మరణ సభను శుక్రవారం సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కల్యాణ్‌నగర్‌లోని నేత్రదాత నివాసంలో అభినందన పత్రం అందజేశారు.

**కాంగ్రెస్‌తోనే మహిళా సాధికారత**

రామగిరి: మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్ అన్నారు. శుక్రవారం రత్నాపూర్ గ్రామ మహిళా అధ్యక్షురాలు కెక్కర్ల స్వరూప ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.

**విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్**

గోదావరిఖనిటౌన్: విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. శుక్రవారం స్థానిక రమేశ్‌నగర్‌లోని ఉషోదయ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్పొరేటర్లు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, ట్రస్మా నాయకులు సమ్మారావు, రవీందర్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

**గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి**

రామగిరి: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య అన్నారు. మండలంలోని పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లి ప్లాట్స్‌లలో సీసీరోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఎంపీటీసీలు కొప్పుల గణపతి, చిందం మహేశ్, నాయకులు కాటం సత్యం, బండారి సదానందం, కండె పోచం, ఉడుత శంకర్, మోత్కూరి నవీన్, కుందారపు కొమురయ్య, ఉమాదేవి పాల్గొన్నారు.

**పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం**

సుల్తానాబాద్: పాఠశాలలో క్రీడలకు రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, గ్రామీణ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారని ఐపీఎస్ పాఠశాల డైరెక్టర్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కష్ణప్రియ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, డాడ్జుబాల్, స్కిప్పింగ్ నిర్వహించారు. ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**అవినీతికి నిదర్శనం కాళేశ్వరం ప్రాజెక్టు**

రామగిరి: నిధుల దుర్వినియోగం, అవినీతి, అసమర్థతకు కాళేశ్వరం ప్రాజెక్టు నిదర్శనమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య అన్నారు. శుక్రవారం సెంటినరీకాలనీ శ్రీపాదభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించేందుకు మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకుంటారని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు రొడ్డ బాపన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమాన్‌పూర్ పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బండారి సదానందం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కండె పోచం, నాయకులు అవినాష్‌గౌడ్, కొప్పుల గణపతి, తీగల సమ్మయ్య, కాటం సత్యం, జాగిరి రజిత, కెక్కర్ల స్వరూప పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

గోదావరిఖని: ఆర్జీ–1 పరిధిలో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం జీఎం కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి మాట్లాడుతు రెండేళ్లుగా రామగుండం మూడు రీజియన్‌లలో కార్మికులకు మురుగునీరు సరఫరా చేస్తున్నారని, గతంలో సీఐటీయూ పక్షాన ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తే ఆర్వో వాటర్ ప్లాంట్‌లు మంజూరు చేసి అందుబాటులోకి తీసుకరాలేదని ఆరోపించారు. మంచినీటి శుద్ధికి రూ.20కోట్లతో ఆరునెలల క్రితం టెండర్ పిలిచినప్పటికీ ఇప్పటివరకు ప్రారంభించలేదన్నారు. కార్మికుల సంక్షేమం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు మండె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసంతో విజయం సాధ్యం



బహుమతి అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సుల్తానాబాద్: ఆత్మవిశ్వాసం, పట్టుదల, కృషితోనే విజయం సాధ్యపడుతుందని సైకాలజిస్ట్ డా.అట్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్నాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల్లో విజయం సాధించడం ఎలా? అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అనుష్క, హారిక, శిరీషకు 'ప్రపంచాన్ని జయించండిలా' పుస్తకం బహూకరించారు. పాఠశాల ఉపాధ్యాయులు క్యాదాసి సారయ్య, రవికుమార్, మంగ పాల్గొన్నారు.

# నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్: నియోజకవర్గంలోని పల్లెల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నరాతుపల్లి, మొట్లపల్లి, కిష్టంపేట, మీర్జంపేట, తారుపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. చిన్నరాతుపల్లిలో రూ.5లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు ప్రారంభం, కిష్టంపేటలో రూ.5లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన, తారుపల్లిలో రూ.10లక్షల సీడీఎఫ్ నిధులతో యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అంతకుముందు మండల కేంద్రంలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

**కాలువ నీరు వదలాలని రైతుల వినతి..**

ఎస్సారెస్పీ కాలువనీటిని వదిలి ఆయకట్టు చివరి భూముల పంటలు కాపాడాలని వివిధ గ్రామాల రైతులు ఎమ్మెల్యే విజయరమణారావుకు విజ్ఞప్తి చేశారు. సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. చిన్నరాతుపల్లికి చెందిన మాజీ సర్పంచు దాసరి నవలోక, నరేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య పాల్గొన్నారు.

**తరలివెళ్లిన కార్యాలయాలు తీసుకొస్తా**

సుల్తానాబాద్: జిల్లా కేంద్రానికి తరలివెళ్లిన అన్ని కార్యాలయాలను సుల్తానాబాద్‌కు తీసుకొస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపు ఉన్న గదుల్లో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వెళ్లిన కార్యాలయాలు త్వరలో పునరుద్ధరణ చేస్తామని తెలిపారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, జెడ్పీటీసీ మినుపాల స్వరూపరాణి, కమిషనర్ వేణుమాధవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంథని: మండలంలోని చిన్నఓదాల గ్రామంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందించారు. రోడ్లు సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్నామని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. శ్రీరాములపల్లి రోడ్డులో వర్షాకాలంలో జనాలు తిప్పలు పడుతున్నారని, పలు వార్డుల్లో సిమెంట్ రోడ్లు అవసరమని వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని నాయకులు సుంకరి మల్లికార్జున్, రాజబాపు, సంతోష్, లింగాల ఆశాలు, బూర్గుల రాకేశ్ తెలిపారు.

## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మేయర్ అనిల్‌కుమార్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి, నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, పలువురు కార్పొరేటర్లు క్షీరాభిషేకం చేశారు. అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీతోపాటు వివిధ పథకాల ద్వారా నిధులు మంజూరు చేసినందుకు, సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. మేయర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన రెండు నెలల వ్యవధిలోనే రామగుండం నియోజకవర్గానికి సుమారు రూ.150కోట్ల నిధులు మంజూరు కావడం వెనుక, స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కృషి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సహకారం ఉందన్నారు. కార్పొరేటర్లు మహంకాళి స్వామి, జనగామ కవితా సరోజినీ, బాల రాజ్‌కుమార్, ముస్తాఫా మహమ్మద్, నాయకులు పాతపెల్లి ఎల్లయ్య, అడ్డాల రామస్వామి సలీం, నీలం గణేశ్, పొన్నం లక్ష్మణ్‌గౌడ్, గణముక్కుల తిరుపతి పాల్గొన్నారు.

## పెంచిన వేతనాలు వెంటనే అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ముత్యంరావు

సుల్తానాబాద్: మున్సిపల్ కార్మికులకు పెంచిన వేతనాలను వెంటనే అందజేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి గాజుల లక్ష్మిని కార్మికులు కోరారు. శుక్రవారం మున్సిపల్ యూనియన్ నాయకత్వం ఆమెకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు ప్రస్తుతం ఉన్న వేతనంపై నెలకు రూ.వెయ్యి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 2న మెమో జారీ చేసిందని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మున్సిపాలిటీలో పనిచేస్తున్న వారికి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాక మహేశ్, నాయకులు మహంకాళి మల్లేశ్, న్యాతరి రమేశ్, బాబు, నరసింగం, రాజేశ్, క్యాదాసి రమేశ్ పాల్గొన్నారు.

## 70 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని దేవునిపల్లిలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఇదే గ్రామానికి చెందిన వారణాసి సమ్మయ్య గ్రామాల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి రెండు ట్రాలీల్లో దాదాపు 70క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నారు. బియ్యంతో పాటు రెండు వాహనాలను సీజ్ చేయడంతో పాటు తదుపరి విచారణ నిమిత్తం సుల్తానాబాద్ పోలీసు స్టేషన్‌కు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

## అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌ను నియమించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలోని కేంద్ర కార్మిక శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌ను నియమించాలని సెంట్రల్ లేబర్ కమిషనర్(హైదరాబాద్)కు వినతిపత్రం అందించారు. ఐఎఫ్‌టీయూ అనుబంధ టీజీఎల్‌బీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ మాట్లాడారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఎన్టీపీసీ సంస్థ, ఆర్ఎఫ్‌సీఎల్ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు ఉన్నాయని, రెండేళ్ల నుంచి అసిస్టెంట్ లేబర్ కమిషనర్ లేకపోవడంతో కార్మికుల సమస్యలు విన్నవించుకోవాలంటే హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. చిలుక శంకర్, రామ్, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

**పల్స్ పోలియో విజయవంతం చేయాలి**

జూలపల్లి: ఈనెల 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పోలియో చుక్కల పంపిణీపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఎలిగేడు: ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఎంపీపీ తానిపర్తి స్రవంతి అన్నారు. ఎలిగేడు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సమావేశం జరిగింది.

సుల్తానాబాద్‌రూరల్: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెడికల్ ఆఫీసర్ అనుదీప్, డాక్టర్ నిస్సి క్రిస్టియానా అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి పీహెచ్‌సీలో శుక్రవారం సుల్తానాబాద్, ఎలిగేడు మండలాలకు చెందిన ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు.